## గడ్డమల్లాయగూడ, చౌదర్‌పల్లిలో
# కొలువుల పండుగ

యాచారం/ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 5 : మండలంలోని గడ్డమల్లాయ గూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల పంట పండింది. బుధ వారం విడుదలైన కానిస్టేబుల్ ఎంపిక జాబితాలో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రెండు గ్రామాల్లో 13 మంది చొప్పున యువకులు కానిస్టేబుల్ ఉద్యో గాలను సాధించారు. దీంతో మండలంలోనే అధికంగా కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన గ్రామాలుగా గడ్డమల్లాయగూడ, చౌదర్‌పల్లి గ్రామాలు సమవుజ్జీ వులుగా నిలిచాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తు న్నారు. ఉద్యోగాలు సాధించిన యువకుల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు సంతోషంలో మునిగితేలారు. ఇప్పటికే రెండు గ్రామాల్లో 30-40 శాతం మంది ఉద్యోగస్తులుగా ఉండటంతో గ్రామాలను కొలువుల కల్పవల్లిగా పిలు స్తారు. గడ్డమల్లాయగూడ గ్రామంలో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన 13 మందిలో ఒకరు సివిల్, 8 ఏఆర్, 4 టీఎస్‌ఎస్‌పీ ఉద్యోగాలకు ఎంపిక య్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గ్రామంలో వివిధ శాఖల్లో సుమారు 100 ఉద్యోగాలు సాధించడం గమనార్హం.

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో ఎంకేఆర్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో శిక్షణ పొందినవారు అధికంగా ఉద్యోగాలను సాధించారు. గ్రామంలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించినవారిలో దండు శేఖర్, చీర జయశ్రీ, గండి కోట రవికుమార్, ఆవ భాస్కర్, ఆర్ల రవి, అచ్చన గణేశ్, అచ్చన మమత, అచ్చన మహేశ్, అచ్చన దినేశ్, బొడ్డు మహేశ్, గౌర సాయికుమార్, గౌర శశి కుమార్, కొనల సంధ్య ఉన్నారు. ఇప్పటికే గ్రామంలో ఇద్దరు ఎస్ఐలుగా ఎంపికైన విషయం విదితమే. ఉద్యోగ సాధనలో గడ్డమల్లాయగూడ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు అంటున్నారు. చౌదర్‌పల్లి గ్రామంలోనూ 13 మంది యువకులు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. ఇందులో 4 టీఏ స్ఎస్‌పీ, 2 ఎక్సైజ్, ఒకరు సివిల్, 6 ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక య్యారు. ఉద్యోగం సాధించినవారిలో గౌరిగె మహేశ్, గౌర నరేశ్, అమీర్‌పేట శశిప్రీత్, అమీర్‌పేట లక్ష్మణ్, బుడిగల మహేశ్, జుట్టు నాగరాజు, అమీర్‌పేట పూజ, గదారి శ్రీను, మారమోని శ్రీను, కొమ్ము హరీశ్, పోదేటి ప్రదీప్ చంద్ర, గౌరిగె శివకుమార్ ఉన్నారు. ఆదర్శ పాఠశాలలో చదువుకున్నవారిలో కొరెంక మహాలక్ష్మి, రమావత్ ప్రవంతి, రాత్లావత్ సరిత, కడారి అనిత, ఉదయ్ కిరణ్, దినేశ్‌కుమార్, దోస మధుకర్, గౌర సాయికుమార్, గాదరి ధరణి, వస్పరి శివ ఉన్నారు. ఇందులో ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు చెందినవారు కావడంతో వీరిని మండల ప్రజాప్రతినిధులు అభినందించారు.

## చలో ఉప్పల్ స్టేడియం

- నగరంలో వరల్డ్ కప్ సందడి షురూ..
- నేడు తలపడనున్న పాకిస్తాన్- నెదర్లాండ్స్
- మధ్యాహ్నం 2 గంటలకు పోటీ

సిటీబ్యూరో, అక్టోబర్ 5 ( నమస్తే తెలంగాణ ): నగరంలో వన్డే వరల్డ్ కప్ సందడి షురూ అయింది. ప్రపంచమంతా ఆసక్తిగా తిలకించే వరల్డ్ కప్ పోరుకు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం మూడు మ్యాచ్‌లకు వేదికగా కాగా.. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పాకిస్తాన్– నెదర్లాండ్స్ మ్యాచ్ జరగనుంది. అక్టోబర్ 9న న్యూజిలాండ్– నెదర్లాండ్స్, అక్టోబర్ 10న పాకిస్తాన్– శ్రీలంక మధ్య పోటీ జరగనుంది. స్టేడియంలో మ్యాచ్ తిలకించే వారికి ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌ను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు బీసీసీఐ ప్రకటించింది.

### ప్రత్యేక బస్సులు..

ఉప్పల్ స్టేడియంలో శుక్రవారం జరగనున్న మ్యాచ్‌కు నగరంలోని 22 ప్రాంతాల నుంచి 56 సిటీ బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ గ్రేటర్ ఈడీ వి.వెంకటేశ్వర్లు గురువారం ప్రకటించారు. ఈ బస్సులు మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8.30 గంటలకు అందుబాటులో ఉంటాయన్నారు.

## వచ్చే నెల 23న..

### కేంద్రప్రభుత్వంపై మాదిగల యుద్ధభేరి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 5: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నవంబర్ 23న కేంద్ర ప్రభుత్వంపై మాదిగల యుద్ధభేరి సభను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ఈ సభకు మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఉస్మా నియా యూనివర్సిటీలోని పీజీఆర్‌ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంగపల్లి శ్రీని వాస్ యుద్ధభేరి సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. కేంద్ర ప్రభుత్వం తమ రాజకీయ అవసరాల కోసం వివిధ విధానపర మైన నిర్ణయాలు తీసుకుంటోందని గుర్తు చేశారు. న్యాయమైన వర్గీకరణ డిమా డ్‌ను మాత్రం పరిష్కరించడం లేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి, గద్దెనెక్కి తొమ్మి దేళ్లు పూర్తయినా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, విద్యార్థి నాయకులు వరిగడ్డి చందు, నాగరాజు, ధర్మారపు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రసవత్తర రాజకీయం

### కల్వకుర్తి కాంగ్రెస్‌పై 'కసిరెడ్డి' పంజా
### నియోజకవర్గంలో నిట్టనిలువునా చీలిన పార్టీ శ్రేణులు

# కాంగ్రెస్ పార్టీకి.. షాకుల మీద షాకులు

- ప్యారాచూట్ నేతకు టికెట్ ఇస్తే ఊరుకునేది లేదంటున్న సుంకిరెడ్డి వర్గం
- ఏడాది నుంచి పార్టీని కాపాడుకుంటూ వచ్చిందెవరని ప్రశ్న
- కార్యకర్తల మెడకు చుట్టుకున్న రేవంత్-వంశీచంద్ పోరు
- నాలుగు మండలాల్లో విస్తృతంగా సమావేశాల నిర్వహణ



తన అనుచరులతో సమావేశమైన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టో బర్ 5 (నమస్తే తెలంగాణ)/ఆమన గల్లు : మహేశ్వరం.. మల్కాజి గిరి.. మెదక్.. తాజాగా కల్వకుర్తి బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వని నేత లను మాత్రమే నమ్ముకొని మనుగడ సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. పార్టీని నమ్ము కున్న వారిని కాదని, రాత్రికి రాత్రి కండువా మార్చిన వారి చేతిలో టికెట్ పెట్టే దుర్నీతిని ఆ పార్టీ నేతలే ఎండగడుతు న్నారు. ఇందులో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గం లోనూ తాజాగా పార్టీ శ్రేణులు అధిష్ఠానానికి షాక్ ఇచ్చాయి. ప్యారాచూట్ నేతతో పని కానిద్దామనుకున్న అధిష్ఠానానికి పార్టీ శ్రేణులు అల్టిమేటం జారీ చేస్తు న్నారు. ఇంతకాలం పార్టీ కోసం కష్టపడిన వారిని కాదని రాత్రికి రాత్రి కండువా మార్చిన వారికి టికెట్ ఇస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నాయి. ఈ మేరకు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి వర్గం నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఆమనగల్లులో నిర్వహించిన సమావేశంలోనూ ఇదేతీరున నేతలు అధిష్ఠానానికి సంకే తాలు పంపారు. సర్వే రిపోర్టుల ఆధారంగా టికెట్లు కేటాయించలేగానీ.. రాత్రికి రాత్రి పార్టీ మారిన వారికి టికెట్లు ఇవ్వాలనుకోవడం వెనక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

సాధారణంగా ఒక రాజకీయ పార్టీ తమ పార్టీ నాయ కుల్లో ఎవరు మెరుగో గుర్తించి.. వారికి పోటీ చేసే అవ కాశం ఇస్తుంది. కానీ తాజా అసెంబ్లీ ఎన్నికల నేప థ్యంలో కాంగ్రెస్ పార్టీ తీరు విచిత్రంగా తయారైంది. సొంత పార్టీ నేతలను కాదని.. అధికార బీఆర్‌ఎస్ ఎవ రికి టికెట్ ఇవ్వలేదో గుర్తించి, వారికి పార్టీ కండువా కప్పి టికెట్ ఇచ్చేందుకు నానా తంటాలు పడుతుంది. ఇప్పటికే మహేశ్వరం నియోజకవర్గంలో కొంతకాలం కిందట పార్టీలోకి వచ్చిన నేతకు టికెట్ ఇస్తున్నారని, ఇందుకోసం ఐదెకరాల భూమి, రూ.10 కోట్లు చేతులు కూడా మారాయనే ఆరోపణలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అదేవిధంగా మేడ్చల్ జిల్లాలోని మల్కాజిగిరి, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ రాత్రికి రాత్రి పార్టీ మారిన వారికి టికెట్ ఖరారైందంటూ చెబుతున్నారు. దీంతో అటు మేడ్చల్, ఇటు మెదక్ డీసీసీ అధ్యక్షులు సహా పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నేతలు రాజీనామాలు చేశారు. ఇప్పుడు కల్వకుర్తి నియోజక వర్గం వంతు వచ్చింది. ఇక్కడ కూడా బీఆర్‌ఎస్‌లో టికెట్ రాని నేతను పార్టీలో చేర్చుకొని టికెట్ చేతిలో పెట్టేందుకు రంగం సిద్ధమవుతుందనే సమాచారం కల్వ కుర్తి కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి.

### రేవంత్-వంశీ పోరుతో..

వాస్తవానికి ఎన్నారై సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కల్వ కుర్తి నియోజకవర్గంలో గత ఏడాది, ఏడాదిన్నరగా కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి ఢిల్లీకే పరిమితం కావడంతో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పార్టీ క్యాడర్ కూడా ఆయన వెంట నిలిచి, పార్టీని ముందుకు తీసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో ఎలాగూ సుంకిరెడ్డికే ఈసారి టికెట్ ఖరారవుతుందనే ఆశతో పార్టీ శ్రేణులు ఉన్నారు. కానీ రాత్రికి రాత్రి బీఆ ర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రె స్‌లోకి రావడంతో ఇప్పుడు పరిస్థితి 'ముందొచ్చిన చెవుల కంటే... వెనకొచ్చిన కొమ్ములు వాడి' అన్నట్లుగా తయారైంది. ముఖ్యంగా ఎన్నారై రాఘవేందర్‌రెడ్డి వెనక టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రోద్బలం ఉండగా... అందుకు వ్యతిరేకంగా వంశీచంద్‌రెడ్డి హుటాహుటిన కసిరెడ్డిని రంగంలోకి దింపారు. అంటే.. రేవంత్–వంశీ పోరు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని నమ్ము కొని పని చేసిన వారి మెడకు చుట్టుకుంది.

### సుంకిరెడ్డికి మద్దతుగా విస్తృతంగా సమావేశాలు

ఇన్నాళ్లు కష్టపడిన తమను కాదని కసిరెడ్డికి టికెట్ ఇస్తే ఊరుకునేది లేదంటూ నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులు గళం విప్పాయి. సుంకిరెడ్డి వర్గం నేతలు భారీ ఎత్తున సమావేశాలు నిర్వహి స్తున్నారు. కల్వకుర్తి, వెల్దండ, ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో కాంగ్రెస్ ప్రజాప్రతిని ధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశాలు నిర్వహించుకొని, ప్యారాచూట్ నేతకు టికెట్ ఇస్తే తాము కార్యాచరణ ప్రకటిస్తామని అధిష్ఠానానికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఆమనగల్లులోని శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో ఆమనగల్లు మండల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు సమా వేశం నిర్వహించారు. నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులకు ఇన్నాళ్లు సుంకిరెడ్డి అండగా నిలిచా రని, పార్టీ కోసం అహర్నిశలు పని చేశారని అన్నారు. కానీ ఇప్పుడు ఆతన్ని కాదని పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి అధిష్ఠానం టికెట్ ఇస్తే ఊరు కునేదిలేదని పలువురు సీనియర్ నాయకులు హెచ్చరించారు. వివిధ గ్రామాలు, తండాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ అను బంధ సంఘాల నాయకులు, ఎన్‌ఎస్‌యూఐ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు, మహి ళలు పెద్ద ఎత్తున ఈ సమావేశానికి వచ్చారు.



ఆమనగల్లులో సమావేశమైన మండల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు

## మూడోసారి అధికారం బీఆర్‌ఎస్‌దే

### ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 5: ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం ఖాయమని, ఇక మెజార్టీ పైనే దృష్టిసారించామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తపేట డివిజన్ ముది రాజ్ సంఘం అధ్యక్షుడు, శృంగేరీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రావుల చంద్ర శేఖర్ (కన్నయ్య) ముదిరాజ్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది యువకులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమ క్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడో సారి హ్యాట్రిక్ విజయం సాధిస్తుంద న్నారు. కొత్తపేట డివిజన్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, శృంగేరీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రావుల చంద్ర శేఖర్ ( కన్నయ్య) ముదిరాజ్ మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నామన్నారు.